



WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

# విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




సెప్టెంబర్ 11 శుక్రవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 219 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

FRIDAY SEPTEMBER 11 2026 | VOL:18 | ISSUE: 219 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

# ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. డీఏలపై సీఎం రేవంత్ కీలక హామీ

**ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో జేఏసీ చర్చలు**

**ఆరు డీఏలు త్వరలో ప్రకటిస్తామని సీఎం హామీ**

**పీఆర్సీ నివేదికను వెంటనే అందేలా చర్యలు**

**ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను తెలియజేసిన నేతలు**

**ఉద్యోగుల పక్షాన ఉంటానని సీఎం హామీ**



ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు.పీఆర్సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం.. తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్' (టీఆర్ఈఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి తెలిపారు.ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్ఈఎస్ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీఆర్ఈఎస్ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఉన్నారు.

## గల్వాన్ తర్వాత తొలిసారి.. మోదీ–జిన్‌పింగ్ భేటీకి రంగం సిద్ధం?

**సెప్టెంబర్ 12, 13న ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు**

**మోదీ–జిన్‌పింగ్ ద్వైపాక్షిక భేటీకి అవకాశం**

**2020 గల్వాన్ తర్వాత ఇదే తొలి ముఖాముఖి చర్చ**

**అజిత్ దోవల్ ఇటీవల చైనాలో చర్చలు**

**సరిహద్దు, వాణిజ్యం, భద్రతపై చర్చకు అవకాశం**



ఐదేళ్లుగా దూరంగా ఉన్న భారత్–చైనా సంబంధాల్లో కీలక పరిణామం చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ,

(మిగతా 2వ పేజీలో..)

## ప్రియాంక గాంధీ ఫేక్ వీడియోలు.. వాటిలో పెట్టుబడులు పెట్టొద్దంటూ ఆఫీస్ హెచ్చరిక

**ఏఐ టెక్నాలజీతో ప్రియాంక గాంధీ ఫేక్ వీడియోల సృష్టి**

**కొన్ని పథకాలలో పెట్టుబడులు పెట్టాలంటూ మోసపూరిత ప్రచారం**

**ఇవి పూర్తిగా నకిలీవని స్పష్టం చేసిన ఆమె కార్యాలయం**

**అనుమానాస్పద పోస్టులను రిపోర్ట్ చేయాలని విజ్ఞప్తి**



కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా పేరుతో సామాజిక మాధ్యమాల్లో కొన్ని నకిలీ వీడియోలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. ఈ పరిణామంపై ఆమె కార్యాలయం తీవ్రంగా స్పందిస్తూ ప్రజలకు హెచ్చరిక జారీ చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

(మిగతా 2వ పేజీలో..)

## విజయ్ ఒక్క సైగతో రాజకీయ దుమారం.. స్టాలిన్‌ను బాధించిన 1976 నాటి ఆ గాయం ఏంటి?

**సీఎం విజయ్ 'దవడ సైగ'తో రాజకీయ దుమారం**

**కావాలని చేయలేదని సీఎం వివరణ**

**తీవ్రంగా తప్పుబట్టిన డీఎంకే వర్గాలు**

**ఎమర్జెన్సీ సమయంలో తన దవడ ఎముకలు విరిగింది నిజమేనన్న స్టాలిన్**

**సీఎం స్థాయి ఏంటో తెలుసుకొని వ్యవహరించాలని హితవు**

ఒక చిన్న సైగ .. తమిళనాడు రాజకీయాల్లో పెద్ద దుమారమే రేపింది. అసెంబ్లీలో సీఎం విజయ్ తన దవడను చేతితో పట్టుకున్న తీరు ఇప్పుడు తీవ్ర రాజకీయ వివాదానికి కారణమైంది. అది డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌ను ఉద్దేశించి చేసిన ఎద్దేవా అంటూ ఆ పార్టీ నేతలు మండిపడ్డారు. విజయ్ మాత్రం తన బాడీ లాంగ్వేజ్ అనుకోకుండా అలా వచ్చిందని, ఎవరినీ వ్యక్తిగతంగా బాధపెట్టాలన్న ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. కానీ ఈ వివాదం వెనుక దాదాపు 50 ఏళ్ల నాటి గాయం ఉంది. అదే.. 1976లో అత్యవసర పరిస్థితి సమయంలో స్టాలిన్‌కు ఎదురైన ఘటన.

అసెంబ్లీలో ఏం జరిగింది?

సెప్టెంబర్ 7న తమిళనాడు అసెంబ్లీలో విజయ్ డీఎంకే ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తూ తీవ్ర విమర్శలు చేశారు. పోలీసు శాఖకు సంబంధించిన గ్రాంట్లపై జరిగిన చర్చకు సమాధానమిస్తున్న సమయంలో ఆయన పలుమార్లు రాజకీయంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో తన దవడను ఒక చేత్తో పట్టుకుని పైకి లేపుతున్నట్లుగా ఓ హావభావం కనిపించింది. ఈ సైగ స్టాలిన్ దవడకు తగిలిన గాయాన్ని ఎద్దేవా చేసేలా ఉందని డీఎంకే నేతలు

(మిగతా 2వ పేజీలో..)



## డీకే శివకుమార్ పాలనకు 100 రోజులు.. సిద్ధరామయ్య ఏమన్నారంటే...!

**ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రభుత్వం సరైన దిశలోనే వెళుతోందన్న సిద్ధరామయ్య**

**100 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎం, కేబినెట్‌కు అభినందనలు**

**ఏడాదికి రూ.52,000 కోట్లతో ఐదు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని వెల్లడి**

**కరువు సాయం కోసం కేంద్రంపై ఆధారపడొద్దని ప్రభుత్వానికి సూచన**

కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం సరైన దిశలోనే పయనిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు, ఆయన మంత్రివర్గానికి సిద్ధరామయ్య అభినందనలు తెలియజేశారు.విధానసౌధలోని బాంక్వెట్ హాల్‌లో గురువారం నిర్వహించిన 'దృఢ కర్ణాటక సంకల్ప – 100 రోజుల విజయవంతమైన ప్రస్థానం' కార్యక్రమంలో సిద్ధరామయ్య ప్రసంగించారు. 100 రోజుల మైలురాయి అనేది కేవలం వేడుకలకు పరిమితం కాకూడదని, ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందు ఉంచి, బాధ్యతలను ఏ మేరకు

(మిగతా 2వ పేజీలో..)



## రూ. 200 కోట్ల భూమిని రేవంత్ రెడ్డి ఆయన సోదరుడికి కట్టబెట్టాడు: కేటీఆర్

**రేవంత్ రెడ్డి తన 18 గంటల సమయాన్ని ఆయన సోదరుల కోసం కేటాయిస్తున్నారన్న కేటీఆర్**

**లక్ష మూలధనం ఉన్న కంపెనీకి రూ. 200 కోట్ల భూమిని కట్టబెట్టారని ఆరోపణ**

**ఈ భూ కుంభకోణంపై ఈడీ, సీబీఐలతో కేంద్రం విచారణ జరిపించాలని డిమాండ్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా

(మిగతా 2వ పేజీలో..)





విజయకెరటం
తెలుగు దినపత్రిక

## సం పా దకీయం

# విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం...

**ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందకపోవడం.. ఒక వ్యవస్థాగత వైఫల్యం**

ఇంజనీరింగ్ చదువు పూర్తి చేసిన వేలాది మంది యువత ఈనాడు ఒక విచిత్రమైన, అన్యాయమైన పరిస్థితిలో చిక్కుకున్నారు. డిగ్రీ పూర్తయింది, పరీక్షలు ఉత్తీర్ణులయ్యారు, కానీ సర్టిఫికెట్లు ఇంకా చేతికి అందలేదు. ఈ ఒక్క కాగితం లేకపోవడం వల్ల వారికి ఉద్యోగాలు, ఉన్నత విద్య, వీసాలు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇలా అన్నీ నిలిచిపోయాయి. భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇంత తీవ్రమైన సమస్యపై ప్రభుత్వం, కళాశాల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇది కేవలం నిర్లక్ష్యమే కాదు.. యువతను నిస్సహాయంగా వదిలేసిన సమాజ వైఫల్యం.

సర్టిఫికెట్ అనేది కేవలం ఒక కాగితం కాదు. అది విద్యార్థి నాలుగేళ్ల కష్టానికి, తల్లిదండ్రుల త్యాగాలకు, కుటుంబ ఆశలకు ప్రతీక. ప్రైవేటు ఉద్యోగాలు, ప్రభుత్వ నోటిఫికేషన్లు, విదేశాల్లో చదువు, బ్యాంకు రుణాలు ఇలా అన్నింటికీ ఒరిజినల్ సర్టిఫికెట్లు అవసరం. ఇది లేకపోతే అభ్యర్థి అర్హుడైనప్పటికీ అనర్హుడిగా మారిపోతాడు. చాలామంది ఇప్పటికే ఇంటర్వ్యూలు కోల్పోయారు, జాబ్ ఆఫర్లు క్యాన్సిల్ అయ్యాయి. కొందరు మానసిక ఒత్తిడికి గురై, నిరాశకు లోనవుతున్నారు. ఇంత ముఖ్యమైన విషయం ఇంకా పరిష్కారం కాకపోవడం అంటే విద్యా వ్యవస్థ అంటే ఎంత నిర్లక్ష్యమో అర్థం అవుతోంది.

ప్రభుత్వం ఈ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది. విశ్వవిద్యాలయాలు, బోర్డులు సర్టిఫికెట్లు జారీ చేయడంలో జాప్యం చేస్తే, ప్రభుత్వం ఒత్తిడి పెట్టాలి. కానీ రాజకీయాలు, ఇతర అంశాలు ముఖ్యం అయ్యాయి. విద్యార్థుల సమస్యలు ఎన్నికల ముందు మాత్రమే గుర్తుకొస్తాయి. సర్టిఫికెట్లు జారీ విషయం ప్రభుత్వానికి , కళాశాల యాజమాన్యాలకు మధ్య ఉన్న వివాదం. కానీ వారిద్దరి మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారు.

కళాశాల యాజమాన్యాలు మరింత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వ కోటా లో చదివిన విద్యార్థులు రెండు నుంచి మూడు లక్షలు చెల్లించాల్సిందేనని మొండికేశాయి. వాటిని చెల్లించలేని పేద విద్యార్థులు చేసేది లేక మౌనంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థి సంఘాలు ఈ విషయంలో పూర్తిగా విఫలమయ్యాయి. ఒకప్పుడు విద్యార్థి సంఘాలు హక్కుల కోసం పోరాడేవి. ఇప్పుడు చాలా సంఘాలు రాజకీయ పార్టీల శాఖలుగా మారిపోయాయి. సర్టిఫికెట్లు అందకపోతే ఉద్యమం చేయాల్సిన వారు మౌనం వహిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో రాజకీయ లబ్ది లేని సమస్యలపై వారు ఆసక్తి చూపడంలేదు. ఇప్పటికైన ప్రజాసంఘాలు మేల్కొనాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల భవిష్యత్తు తో చెలగటమడుతున్న వారి పై ఉద్యమించాల్సిన అవసరం ఉంది.

సమీ సీనియర్ జర్నలిస్ట్.

# డీకే శివకుమార్ పాలనకు 100 రోజులు.. సిద్ధరామయ్య ఏమన్నారంటే...!

**మొదటి పేజీ తరువాయి)**

నెరవేరుస్తోందో నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశమని ఆయన పేర్కొన్నారు. డీకే శివకుమార్ నేతృత్వంలోని సర్కార్ సరైన మార్గంలోనే సాగుతోందని తాను భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురైనప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీ పథకాలను విజయవంతంగా అమలు చేసిందని సిద్ధరామయ్య గుర్తు చేశారు. ఈ పథకాల కోసం ఏటా సుమారు రూ. 52,000 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన వివరించారు. సామాజిక అసమానతలను తొలగించి, అన్ని వర్గాల పేదలకు అండగా నిలవడమే ఈ పథకాల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇదే తరుణంలో ప్రతిపక్ష బీజేపీ తీరుపై సిద్ధరామయ్య విమర్శలు గుప్పించారు. బీజేపీ చేపట్టిన 'బళ్లారి చలో' పాదయాత్రను కేవలం ఒక రాజకీయ గిమ్మిక్కుగా ఆయన అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై చర్చించకుండా, కేవలం మాజీ మంత్రి నాగేంద్ర రాజీనామా అంశంపైనే బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. కరవు సహాయక చర్యల కోసం పూర్తిగా కేంద్రంపైనే ఆధారపడవద్దని, అవసరమైన తాలూకాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని సీఎం శివకుమార్‌కు సూచించారు. పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉండాలని ఆయన కోరారు.

# రూ. 200 కోట్ల భూమిని రేవంత్ రెడ్డి ఆయన సోదరుడికి కట్టబెట్టాడు: కేటీఆర్

**మొదటి పేజీ తరువాయి)**

సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆ వివాదాస్పద భూ కేటాయింపు స్థలాన్ని ఈరోజు ఆయన సందర్శించిన పర్యవేక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు.కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరైనా కేవలం లక్ష రూపాయలతో స్టార్టప్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వందల కోట్ల విలువైన భూములు ఇస్తుందా..? అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడుతోందని ఆరోపించారు. నెలకు రూ. 4,000 పింఛన్, మహిళలకు రూ. 2,500, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రియాంక గాంధీ ఫేక్ వీడియోలు.. వాటిలో పెట్టుబడులు పెట్టొద్దంటూ ఆఫీస్ హెచ్చరిక

**మొదటి పేజీ తరువాయి)**

(ఏఐ) సాంకేతికతతో సృష్టించిన ఈ వీడియోలను చూసి మోసపోవద్దని స్పష్టం చేసింది.కొన్ని సంస్థలు, పథకాలలో పెట్టుబడులు పెట్టాలని ప్రియాంక గాంధీ స్వయంగా ప్రోత్సహిస్తున్నట్లుగా ఈ నకిలీ వీడియోలను రూపొందించారు. ఇందుకోసం ఆమె ఛాయాచిత్రాలతో పాటు, ఏఐ ద్వారా ఆమె గొంతును (వాయిస్ క్లోనింగ్) అనుకరించారు. ఇవి అచ్చం ఆమె గొంతులాగే ఉండటంతో ప్రజలు నిజమని నమ్మే ప్రమాదం ఉందని ఆమె కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వీడియోలు పూర్తిగా నకిలీవని, మోసపూరితమైనవని ప్రియాంక గాంధీ కార్యాలయం గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. వీటిని నమ్మి ఎవరూ నగదు పెట్టుబడులు పెట్టవద్దని విజ్ఞప్తి చేసింది. అలాగే, ఇటువంటి వీడియోలతో పాటు వచ్చే అనుమానాస్పద లింకులను అస్సలు క్లిక్ చేయవద్దని హెచ్చరించింది. సామాజిక మాధ్యమాల్లో ఇటువంటి పోస్టులు కనిపిస్తే వెంటనే వాటిని రిపోర్ట్ చేసి, ఆ ఖాతాలను బ్లాక్ చేయాలని ప్రజలకు సూచించింది. డీప్‌ఫేక్ సాంకేతికతను అడ్డుపెట్టుకుని ప్రముఖుల పేర్లతో సాగుతున్న ఆర్థిక మోసాల నుంచి ప్రజలను కాపాడేందుకే ఈ హెచ్చరిక జారీ చేసినట్లు వెల్లడించింది.

# గల్వాన్ తర్వాత తొలిసారి.. మోదీ–జిన్‌పింగ్ భేటీకి రంగం సిద్ధం?

**మొదటి పేజీ తరువాయి)**

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరిగే అవకాశముంది. అదే జరిగితే 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఇద్దరు నేతలు ముఖాముఖి చర్చలు జరపడం ఇదే తొలిసారి అవుతుంది.జిన్‌పింగ్ శనివారం భారత్‌కు రానున్నట్లు సమాచారం. ఏడేళ్ల తర్వాత ఆయన భారత్‌లో అడుగుపెట్టనున్నారు. ఇటీవల కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో మోదీ, జిన్‌పింగ్ ఒకే వేదికపై కనిపించి కరచాలనం చేసుకున్నారు. అయితే అప్పుడు ద్వైపాక్షిక చర్చలు జరగలేదు. ఇప్పుడు బ్రిక్స్ వేదికగా భేటీ జరిగితే ఇరుదేశాల సంబంధాలపై దాని ప్రభావం కీలకంగా ఉండొచ్చు.

**సరిహద్దు నుంచి వాణిజ్యం వరకు..**

జిన్‌పింగ్ పర్యటనకు ముందు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనాలో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. సరిహద్దు వ్యవహారాలపై డబ్ల్యూఎంసీసీ సమావేశం తర్వాత ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల చర్చలు కూడా జరిగాయి. తాజా భేటీలో సరిహద్దు సమస్య, వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, ఎల్ఏసీ వద్ద ఉద్రిక్తతలు మళ్లీ తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.

**అరుణాచల్ ప్రదేశ్.. మరో కీలక అంశం**

లడఖ్‌లో ఉద్రిక్తతలు తగ్గినా సరిహద్దు వివాదం మాత్రం పరిష్కారం కాలేదు. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా చేస్తున్న వాదనలను భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ తమ భూభాగమని చైనా చెబుతుండగా.. భారత్ దాన్ని పూర్తిగా తిరస్కరిస్తోంది. ఇటీవల అప్పర్ సుబన్‌సిరి ప్రాంతంలో చైనా సైనిక కదలికలపై వచ్చిన నివేదికలు కూడా ఆందోళన పెంచాయి. ఇలాంటి పరిస్థితుల్లో మోదీ–జిన్‌పింగ్ భేటీ జరిగితే సరిహద్దులో శాంతి, స్థిరత్వంపై భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసే అవకాశం ఉంది. అమెరికా సుంకాలు, పశ్చిమాసియాలో అస్థిరత నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఆర్థిక, దౌత్య సంబంధాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలన్నదీ చర్చకు రావచ్చు.

# విజయ్ ఒక్క సైగతో రాజకీయ దుమారం.. స్టాలిన్‌ను బాధించిన 1976 నాటి ఆ గాయం ఏంటి?

**మొదటి పేజీ తరువాయి)**

ఆరోపించారు. ఆ వెంటనే వివాదం ముదిరింది.

విజయ్ ఏం చెప్పారు?

విమర్శలు పెరగడంతో విజయ్ వివరణ ఇచ్చారు. అసెంబ్లీలో తన బాడీ లాంగ్వేజ్ అనుకోకుండా వచ్చిందని చెప్పారు. అది ఉద్దేశపూర్వకంగా చేసిన హావభావం కాదని స్పష్టం చేశారు. తన చర్యను ఎవరి వ్యక్తిగత భావాలను దెబ్బతీసే ప్రయత్నంగా చూడొద్దని కోరారు. అయితే అప్పటికే రాజకీయంగా నష్టం జరిగిపోయింది. డీఎంకేతో పాటు వామపక్ష నేతలు కూడా ఈ చర్యను తప్పుబట్టారు.

అసలు 1976లో ఏం జరిగింది?

ఇక్కడే అసలు కథ మొదలవుతుంది. 1975లో దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై తీవ్ర ఆంక్షలు విధించింది. 1976లో తమిళనాడులో కరుణానిధి నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం రద్దయింది. అదే సమయంలో యువ డీఎంకే నాయకుడిగా ఉన్న స్టాలిన్‌ను అరెస్టు చేశారు.ఆయనను 'మీసా' చట్టం కింద అదుపులోకి తీసుకుని మద్రాస్ జైలులో నిర్బంధించారు. మీసా అంటే 'మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్'. విచారణ లేకుండానే వ్యక్తులను నిర్బంధించే విస్తృత అధికారాలను ఈ చట్టం ప్రభుత్వానికి ఇచ్చింది. అత్యవసర పరిస్థితి సమయంలో రాజకీయ ప్రత్యర్థులపై దీన్ని విస్తృతంగా ఉపయోగించారు.

జైలులోనే దవడకు గాయమా?

స్టాలిన్ తన ఆత్మకథ ఉంగళిల్ ఒరువన్‌లో ఆ సమయం గురించి వివరించారు. జైలు పరిస్థితులు, అక్కడ జరిగిన హింసను ప్రస్తావించారు. అప్పటి జైలు ఘటనలపై విచారణ జరిపిన జస్టిస్ ఎం.ఎం. ఇస్మాయిల్ కమిషన్ ముందు ఇచ్చిన వాంగ్మూలాల్లోనూ ఖైదీలపై తీవ్ర భౌతిక దాడుల ప్రస్తావన వచ్చింది. ఆ దాడుల్లో స్టాలిన్ దవడ విరిగినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. అందుకే డీఎంకేకు ఆ గాయం కేవలం వ్యక్తిగత శారీరక గాయం కాదు. అత్యవసర పరిస్థితి నాటి అణచివేతకు గుర్తుగా పార్టీ నేతలు దాన్ని చూస్తారు. స్టాలిన్ రాజకీయ జీవితంలో ఆ ఘటనకు ప్రత్యేక స్థానం ఉంది.

మిత్రపక్షం నుంచే విజయ్‌కు ఎదురుదెబ్బ

ఈ వివాదం విజయ్ పార్టీకి మద్దతుగా ఉన్న వామపక్షాలతోనూ ఇబ్బంది తెచ్చింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. శణ్ముగం.. విజయ్ సైగను తీవ్రంగా తప్పుబట్టారు. అత్యవసర పరిస్థితి సమయంలో స్టాలిన్‌పై జరిగిన దాడిని గుర్తుచేస్తూ.. ఆయన దవడ విరిగిన ఘటనను ఎద్దేవా చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. అసెంబ్లీ ప్రజా సమస్యలపై చర్చించాల్సిన వేదిక అని, వ్యక్తిగత విమర్శలకు దాన్ని ఉపయోగించడం సరికాదని శణ్ముగం అన్నారు.

స్టాలిన్ స్పందన ఇదే..

స్టాలిన్ కూడా ఈ వివాదంపై నేరుగా స్పందించారు. విజయ్‌ను ఉద్దేశించి "తమ్ముడు విజయ్.. నువ్వు చేసిన సైగ నిజమే. పోలీసుల దాడిలో నా దవడ ఎముకలు విరిగాయి. ఆ దాడి గాయాల మచ్చలు ఇప్పటికీ నా శరీరంపై ఉన్నాయి. మీ స్థాయి ఏంటో గుర్తించి అందుకు తగ్గట్టుగా వ్యవహరించాలి. మీరు ప్రభుత్వాన్ని సినిమా షూటింగ్‌లా నడుపుతున్నారు. అసెంబ్లీని రీల్స్ చేసే ప్రదేశంగా మార్చారు. మేం నిర్మించిన వంతెనను కూడా ఫొటోషూట్‌కు ఉపయోగించుకున్నారు" అంటూ స్టాలిన్ తీవ్రంగా విమర్శించారు.

# ఎలినో ప్రభావంతో వచ్చే సంవత్సరం వరకు వర్షాలు పడవు జిల్లా కలెక్టర్





విబిజి రాంజీ కింద గ్రామాభివృద్ధికి తోడ్పడే పనులనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. గురువారం అయన ఉదయాదిత్య భవన్లో విబిజి రాంజీ పనులపై ఎంపీడీవోలు ,ఎంపీఓలు, ఏపీవోలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామానికి ఎక్కువ పనులు వచ్చేందుకు సగటు రోజు వేతనం పెంచేలా చూడాలని, అప్పుడే ఎక్కువగా మెటీరియల్ కాంపోనెంటు గ్రామానికి వస్తుందని, ఇందుకు విబిజి రాంజీ కింద పని చేసే వారి సంఖ్యను పెంచాలని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం ఉన్న పనుల సంఖ్యను పెంచుకుంటే ఎక్కువ మొత్తంలో గ్రామానికి ఉపయోగపడతాయని, తద్వారా గ్రామాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ముందే నిర్దేశించుకున్న సమగ్ర గ్రామ పంచాయతీ ప్రణాళికను గ్రామసభలో చర్చించి గ్రామానికి అవసరం ఉన్న పనులను చేర్చుకోవాలని తెలిపారు. ముఖ్యంగా అన్ని పాఠశాలల్లో టాయిలెట్స్, తాగునీరు, కిచెన్ షెడ్లు, అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్సు, లాబరేటరీలు చేపట్టేందుకు అవకాశం ఉన్నందున యుద్ధ ప్రాతిపదికన అన్ని పాఠశాలల్లో ఈ పనులు మంజూరు చేసుకుని పూర్తి చేయాలని చెప్పారు .ఈ విషయాన్ని ఒక ఛాలెంజ్ గా తీసుకొని అధికారులు పనిచేయాలని, ఇంకా ఇప్పటివరకు మంజూరు చేయనిచోట మంజూరు చేసి పనులు మొదలు పెట్టాలన్నారు. చెరువులు ఉన్న చోట మత్స్యకారుల జాబితా ఆధారంగా చేపలు పెంచేందుకు అవకాశం ఉన్న చెరువుల వద్ద స్థానిక మత్స్యకారుల సహకార సంఘాలకు ముందే సమాచారం అందించి వారి జీవనోపాధి పెరిగేలా చూడాలని చెప్పారు.విబిజి రాంజీ కింద చేపట్టే పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని ,ఈ విషయాలన్నీ స్థానిక గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ కు ,ఇతర ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. అలాగే ఎల్ నినో ప్రభావం వల్ల వచ్చే జూన్ వరకు వర్షాలు వచ్చే అవకాశం లేనందున భూగర్భ జలాలు తగ్గిపోయి ప్రజలు ,పశువులు నీటి కోసం ఇబ్బంది పడకుండా నీటి సంరక్షణ పనులు చేపట్టాలని, ఇందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ,తెలంగాణ జలసిరిలో కూడా ఇలాంటి పనులు చేపట్టేందుకు ప్రాధాన్యత నీయడం జరుగుతున్నదని, కమ్యూనిటీ సోక్ పిట్లు ,మ్యాజిక్ సోక్ పిట్లకు యుద్ధ ప్రాతిపదికన ప్రణాళిక రూపొందించుకుని చేపట్టాలని చెప్పారు.వి బి జి రామ్ జి కింద చేపట్టే పనులపై మాస్టర్ ట్రైనర్ ఓరెంటేషన్ వర్క్ షాప్ కు హాజరైన అధికారులకు తెలియజేశారు.స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి ,డిపిఓ తరుణ్ చక్రవర్తి, డిఎఫ్ఓ రాజశేఖర్, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు

# ట్రాన్స్ జెండర్లు మంచి గౌరవమైన జీవితం గడపాలి డిఎస్పి

**నల్లగొండ సెప్టెంబర్ 10 విజయ కెరటం ప్రతినిధి**

ట్రాన్స్‌జెండర్లు చట్టాలను గౌరవిస్తూ గౌరవప్రదమైన జీవనం సాగించాలి ..బలవంతపు వసూళు ్ల, ప్రజల వేధింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు -- నల్గొండ డీఎస్పీ కే. శివరాం రెడ్డి నల్గొండ పట్టణ పరిధిలోని ట్రాన్స్‌జెండర్లతో నల్గొండ డీఎస్పీ కే. శివరాం రెడ్డి ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా గౌరవప్రదంగా జీవించాలని ఈ సందర్భంగా డీఎస్పీ సూచించారు.వ్యాపార సంస్థలు, దుకాణాలు, ఇళ్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, పండుగలు, శుభకార్యాలు తదితర సందర్భాల్లో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ బలవంతంగా డబ్బులు డిమాండ్ చేయడం లేదా వసూలు చేయడం చేయరాదని స్పష్టం చేశారు. ఎవరైనా స్వచ్ఛందంగా అందించే సహాయాన్ని మాత్రమే స్వీకరించాలని, డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడం, బెదిరించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, ప్రజలను వేధించడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజల నుంచి ట్రాన్స్‌జెండర్లపై వేధింపులు, బెదిరింపులు లేదా బలవంతపు వసూళ్లకు సంబంధించిన ఫిర్యాదులు అందితే వాటిని పరిశీలించి, నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. అదే సమయంలో ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు, వేధింపులు లేదా ఇతర చట్టపరమైన సమస్యలు ఉంటే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని, పోలీస్ శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ట్రాన్స్‌జెండర్లు కూడా సమాజంలో ఒక భాగమేనని, వారి పట్ల ప్రతి ఒక్కరూ గౌరవభావంతో వ్యవహరించాలని, అదే విధంగా వారు కూడా ప్రజల హక్కులు, స్వేచ్ఛకు భంగం కలగకుండా చట్టబద్ధంగా వ్యవహరించాలని డీఎస్పీ సూచించారు.




శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.ఈ అవగాహన కార్యక్రమంలో సీఐలు ఆదిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సైదాబాబు, షరీఫ్‌తో పాటు జిల్లాలోని పలువురు ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ స్ఫూర్తిగా స్వరోదయ తెలంగాణ కోసం టీఆర్ఎస్ పోరాటం

**టీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు**

**హైదరాబాద్ :**

దొరల పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తిగా సర్వోదయ తెలంగాణ కోసం తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని పార్టీ నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, నవీన్ ఆచారి అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి వారి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...దొరల పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ఆమె స్ఫూర్తితోనే సర్వోదయ తెలంగాణ కోసం తమ పార్టీ చీఫ్ కవిత ముందడుగు వేస్తున్నారన్నారు. అప్పట్లో దొరలు, దేశ్ ముఖ్ ల దుర్మార్గ పాలన సాగితే...ఇప్పుడు నయా హిట్లర్ల రూపంలో అదే విధమైన పాలన సాగుతుందని చెప్పారు. ఈ అక్రమ పాలకుల ఆటకట్టించేందుకే కవిత ఆధ్వర్యంలో టీఆర్ఎస్ పుట్టుకొచ్చిందన్నారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఈ ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎత్తరి మారన్న, ఆనందం, బొడ్డుపల్లి లింగం తదితరులు పాల్గొన్నారు.




# లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి సీనియర్ సివిల్ జడ్జి

**నల్లగొండ సెప్టెంబర్ 10 విజయ కెరటం ప్రతినిధి**

ఈ నెల 12 న (శనివారం ) నల్గొండ జిల్లా పరిధిలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్. లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి-సీనియర్ సివిల్ జడ్జి ఓ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. హిమబిందు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12 న (శనివారం) నల్గొండ జిల్లా కోర్టు తో పాటు, జిల్లా పరిధిలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించనున్నట్లు నల్లగొండ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఓ సీనియర్ సివిల్ జడ్జి జి. హిమబిందు గురువారం ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) ప్రధాన న్యాయమూర్తి మరియు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.వాజ్యదారుల ప్రయోజనార్థం నల్గొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయ సేవాధికార కమిటీలు జిల్లాలోని నల్గొండ, మిర్యాలగూడ, నకిరేకల్, దేవరకొండ మరియు నిడమానూరు న్యాయస్థానాలలో లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేశాయని ,కక్షిదారులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ పెండింగ్ కేసులు, వివాదాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు.

# వీరనారి చాకలి ఐలమ్మకు బీఎస్పీ నాయకుల ఘన నివాళి

**నేటి తరం మహిళలు ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి: వనం మహేందర్**

**వరంగల్ విజయ కెరటం సెప్టెంబరు 10 :**



చిట్యాల వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం న్యూ శాయంపేట జంక్షన్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి బహుజన సమాజ్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బస్కే నాగరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షులు వనం మహేందర్ పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వనం మహేందర్ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ పోరాటం మహిళా సాధికారత, ఆత్మగౌరవం, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం, తెగువ, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష, అన్యాయాలను ఎదుర్కొనేందుకు ఐలమ్మ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నేటి తరం మహిళలు చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని ఆత్మగౌరవంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు పస్కుల ప్రవీణ్, కోశాధికారి పోలేపాక లోకేష్, కార్యవర్గ సభ్యులు ఉపేందర్, వరంగల్ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి జన్ను అనిల్ కుమార్, వర్ధన్నపేట అధ్యక్షులు అడ్డూరి సమ్మయ్య, రజనీకాంత్, మనోహర్ తదితర బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు అధికారం పోయినా అహంకారం తగ్గలేదు

**తాతా మధు వ్యాఖ్యలపై కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: మహమ్మద్ అయూబ్**

**వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 10:**

అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నాయకుల తీరు మారలేదని, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారని అయూబ్ విమర్శించారు.బీఆర్ఎస్, బీజేపీల దళిత వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో గురువారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్ వద్ద వరంగల్--ఖమ్మం జాతీయ రహదారిపై భారీ రాస్తారోకో నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ, తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ అనంతరం సభా ప్రాంగణాన్ని శు ద్ధి చేశారంటూ వచ్చిన ఘటన దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని విమర్శించారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించి క్షమాపణ చెప్పాలని కోరారు. అలాగే ప్రభుత్వ అధికారిపై కేటీఆర్ చేయి చేసుకున్నారంటూ వచ్చిన ఆరోపణలను ప్రస్తావిస్తూ, ప్రజాప్రతినిధులు చట్టాన్ని గౌరవించాలని, దళితులు, ప్రభుత్వ ఉద్యోగులపై అవమానకర చర్యలను ప్రజలు సహించరని అయూబ్ అన్నారు. బీఆర్ఎస్, బీజేపీలకు ప్రజలు తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ప్రశాంత్, జన్ను అనిల్ కుమార్, అడ్డూరి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



విజయకెరటం

తెలుగు దినపత్రిక

## ‘ఎపిక్’ దాదాపు నా జీవిత కథే.. కానీ ఆ ఒక్కటి జరగలేదు: ఆనంద్ దేవరకొండ

**ఒక్కటి తప్ప ‘ఎపిక్’ సినిమా కథ నా జీవితంలో జరిగిందన్న ఆనంద్ దేవరకొండ**

**లివ్-ఇన్ రిలేషన్‌షిప్ నేపథ్యం ఉన్నా ఫ్యామిలీతో చూసేలా ఉంటుందని హామీ**

**అన్న విజయ్, వదిన రష్మిక తనకు అండగా ఉంటారని వెల్లడి**

**‘తక్షకుడు’ అనే మిస్టికల్ థ్రిల్లర్‌లో అంధుడిగా నటించనున్నట్టు ప్రకటన**



యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం ‘ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్’. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆనంద్ దేవరకొండ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సినిమా దాదాపు తన జీవిత కథేనని, కేవలం ఒక్క విషయం మినహా మిగతావన్నీ తన నిజ జీవితంలో జరిగిన సంఘటనలేనని ఆయన వెల్లడించారు. “నేను ఒక బాధ్యత గల నటుడిని. నేను ఎంచుకునే కథలు కూడా అదే రీతిలో ఉంటాయి. ఈ సినిమా వాస్తవ జీవితానికి అద్దం పడుతుంది. ప్రేమ, కుటుంబం, బాధ్యతలు వంటి అంశాల మేళవింపుగా సాగే ఈ చిత్రం హీరో-విలన్ల మధ్య నడిచే కథ కాదు.. ఇదొక అందమైన ప్రయాణం,” అని ఆయన పేర్కొన్నారు. తాను అమెరికాలో చదువుకున్నప్పటి అనుభవాలకు, లండన్ నేపథ్యంలో సాగే ఈ కథకు చాలా దగ్గర పోలికలు ఉన్నాయని తెలిపారు. “విదేశాల్లో కుటుంబానికి దూరంగా ఉంటూ, ఆర్థిక సమస్యలను అధిగమించి స్థిరపడాలనుకునే ఎంతోమంది యువతకు ఈ కథ కనెక్ట్ అవుతుంది. సినిమాలో హీరో ఓ అమ్మాయితో కలిసి నివసిస్తాడు. నా నిజ జీవితంలో ఆ ఒక్కటి మినహా, మిగిలినదంతా నా కథే” అని ఆనంద్ వివరించారు. లివ్-ఇన్ రిలేషన్‌షిప్ నేపథ్యం ఉన్నప్పటికీ, దర్శకుడు ఆదిత్య హాసన్ ఎక్కడా ఇబ్బందికరంగా లేకుండా, కుటుంబ ప్రేక్షకులు సైతం వీక్షించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారని ఆయన భరోసా ఇచ్చారు. సాధారణంగా ఇంట్లో సినిమా విషయాలు పెద్దగా చర్చించుకోమని, అయితే తన సోదరుడు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తనకు ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. ఇటీవల తనకు, దర్శకుడు సందీప్ రెడ్డి వంగాకు వారు వాచీలను బహుమతిగా ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం తాను ‘తక్షకుడు’ అనే మిస్టికల్ థ్రిల్లర్‌లో అంధుడి పాత్రలో నటిస్తున్నానని, అలాగే మరో ఇండో-కొరియన్ ప్రాజెక్ట్ చర్చల దశలో ఉందని తన భవిష్యత్ చిత్రాల గురించి వెల్లడించారు.

## ‘ది ప్యారడైజ్’ చిత్రీకరణ పూర్తి.. నాని కొత్త పోస్టర్ రిలీజ్!

**‘ది ప్యారడైజ్’ షూటింగ్ పూర్తి చేసుకున్న నాని**

**శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ‘దసరా’ తర్వాత వస్తున్న సినిమా**

**సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధం**

**కొత్త పోస్టర్‌లో నాని రగ్డ్ లుక్.. వైరల్ అవుతున్న ఫోటో**

**తిరుగుబాటు నేపథ్యంలో సాగే ఇంటెన్స్ యాక్షన్ డ్రామా**

నేచురల్ స్టార్ నాని హీరోగా, యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ది ప్యారడైజ్’ షూటింగ్ పూర్తి చేసుకుంది. ‘దసరా’ వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో, ఇండస్ట్రీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్ర యూనిట్ సినిమా మొత్తం చిత్రీకరణను విజయవంతంగా ముగించినట్లు సమాచారం. ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. అంతకంటే ఒకరోజు ముందుగా, అంటే సెప్టెంబర్ 23న ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు. గురువారం చిత్ర యూనిట్ నానికి సంబంధించిన ఒక కొత్త పోస్టర్‌ను విడుదల చేసి అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ పోస్టర్‌లో నాని పొడవాటి జుట్టు, గుబురు గడ్డంతో పీరియడ్ రగ్డ్ లుక్‌లో కనిపిస్తున్నారు. చేతిలో భారీ తుపాకీ పట్టుకుని, తీవ్రమైన చూపులతో ఆకట్టుకుంటున్నారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన మొబైల్ ఫోన్ నుంచి తీసిన స్క్రీన్‌షాట్‌ను పోస్టర్‌గా విడుదల చేసినట్టు తెలుస్తోంది.ఇప్పటికే విడుదలైన ‘ది ప్యారడైజ్’ టీజర్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. పీడిత ప్రజల తిరుగుబాటు నేపథ్యంలో ఈ సినిమా సాగనుందని టీజర్ స్పష్టం చేసింది. “ఇకపై ఈ నేల ఎవరిది?”, “అసహ్యించుకున్న నలుపే మా జెండా.. కాకి మా చిహ్నం” వంటి సంభాషణలు, రక్తపాతంతో కూడిన యాక్షన్ సన్నివేశాలు సినిమా ఎంత తీవ్రంగా ఉండబోతోందో సూచించాయి. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.వాస్తవానికి ఈ సినిమాను మొదట మార్చి 26న, ఆ తర్వాత ఆగస్టు 21న విడుదల చేయాలని భావించినప్పటికీ, పలు కారణాలతో సెప్టెంబర్ 24కి వాయిదా పడింది. ఎట్టకేలకు షూటింగ్ పూర్తి కావడంతో, ఇక ప్రమోషన్ల జోరు పెంచి సినిమాను ప్రేక్షకుల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు యూనిట్ సిద్ధమవుతోంది.





## ఆడవాళ్ల సినిమా.. రూమ్‌లో అందరూ పురుషులే!: ఇండస్ట్రీ తీరుపై ‘దంగల్’ నటి ఆవేదన

**సినీ పరిశ్రమలో పితృస్వామ్యంపై దంగల్ నటి ఫాతిమా సనా షేక్ వ్యాఖ్యలు**

**పురుషాధిక్యతకు పురుషులతో పాటు మహిళలు కూడా కారణమేనన్న ఫాతిమా**

**మహిళా సాధికారత కథల చర్చల్లో ఒక్క మహిళ కూడా ఉండరని వెల్లడి**

**ప్రతి మహిళా తన కోసం తాను పోరాడాలని పిలుపు**

**‘హుంకార్’ వెబ్ సిరీస్‌లో పోలీస్ అధికారిగా కనిపించనున్న నటి**

‘దంగల్’ చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ నటి ఫాతిమా సనా షేక్, సినీ పరిశ్రమలో వేళ్లూనుకుపోయిన పితృస్వామ్యం, లింగ వివక్షపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తాజా వెబ్ సిరీస్ “హుంకార్-ది రోర్” ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడుతూ.. పరిశ్రమలో మహిళలు తమ గొంతు వినిపించడానికి ఎంతగా పోరాడాల్సి వస్తుందో వివరించారు.పితృస్వామ్య ధోరణులకు కేవలం పురుషులను నిందించడం సరికాదని, ఈ వ్యవస్థలో మహిళలు కూడా భాగమేనని ఫాతిమా స్పష్టం చేశారు. “ఈ పితృస్వామ్యం పురుషుల తప్పు మాత్రమే కాదు. ఇందులో మహిళలు కూడా ఉన్నారు. మనందరం ఒకే రకమైన సామాజిక వాతావరణంలో పుట్టి పెరుగుతాం. అందుకే అది మనలో అంతర్లీనంగా పాతుకుపోయింది. దీనిపై మనమంతా పోరాడాలి” అని ఆమె అన్నారు.పరిశ్రమలో తనకు ఎదురైన ఓ అనుభవాన్ని ఫాతిమా పంచుకున్నారు. మహిళా సాధికారతకు సంబంధించిన కథల చర్చలకు పిలిచినప్పుడు, ఆ గదిలో తాను తప్ప మరో మహిళ ఉండేది కాదని గుర్తుచేసుకున్నారు. “నిర్మాత వచ్చి ఇది మీకోసం అద్భుతమైన సినిమా అంటారు. మహిళ తన గొంతును వెతుక్కునే పాత్ర అని చెబుతారు. కానీ ఆ గదిలో నిర్మాత, దర్శకుడు, రచయిత అంతా మగాళ్లే ఉంటారు” అని ఆమె వివరించారు. అలాంటి సందర్భాల్లో తాను ఏదైనా సూచన ఇవ్వబోతే, వారు దాన్ని తీసుకోలేరని, వింత జోకులు వేస్తారని, మహిళల భావాలు ఎలా ఉంటాయో తమకే వివరిస్తారని (మాన్‌స్ప్లెయిన్) ఆవేదన వ్యక్తం చేశారు. హింసాత్మక ఘటనల విషయంలో కూడా మహిళల ఫీలింగ్స్ గురించి పురుషులే పాఠాలు చెబుతారని, అది పెద్ద విషయం కాదన్నట్టు మాట్లాడతారని ఆమె పేర్కొన్నారు.ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవాలంటే ప్రతి మహిళా తన కోసం తాను నిలబడటం, పోరాడటం నేర్చుకోవాలని ఫాతిమా పిలుపునిచ్చారు. ఇక ఆమె నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ ‘హుంకార్-ది రోర్’ విషయానికొస్తే.. ఇది ఒక కోర్ట్ రూమ్ డ్రామా. ఇందులో ఫాతిమా నిజాయతీ గల పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఈ సిరీస్‌ను ప్రియాంక చోప్రాకు చెందిన పర్పుల్ పెబుల్ పిక్చర్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్, బిర్లా స్టూడియోస్, మంగత

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528